
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శనివారం 15 జూన్ 2024



అసంపూర్తిగా సచివాలయ భవనాలు

సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడమే కారణం

- ఏజెన్సీ వ్యాప్తంగా 212 సచివాలయాలు
- భవనాలు పూర్తయినవి 87 మాత్రమే
- మిగిలినవి పరాయి పంచన...

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో ముందున్న గ్రామ సచివాయాల భవనాలను ఐదేళ్ల పాలనలో పూర్తి చేయకపోవడం అనేక విమర్శలు తావిస్తున్నది. ఈ భవనాల నిర్మాణానికే నిధులను సక్రమంగా విడుదల చేయకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించింది. అభివృద్ధి విషయంలో వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ ఏపాటిదో సచివాలయ భవనాల నిర్మాణాలనే ఉదాహరణగా పేర్కొనవచ్చు.



జి.మాడుగుల మండలంలో అసంపూర్తిగా ఉన్న పాలమామిడి సచివాలయ భవనం

పాడేరు ఏజెన్సీ పదకొండు మండలాల పరిధిలో 212 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. 2020లో వాటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.40 లక్షలతో రెండంతస్తుల భవనాలను నిర్మించాలని ప్రతిపాదించింది. అందులో భాగంగా ఏజెన్సీ వ్యాప్తంగా 212 గ్రామ సచివాలయాలకు భవనాలను నిర్మించేందుకు రూ.84 కోట్ల 80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అలాగే భవనాల నిర్మాణ పనులు జరిగిన స్థాయిని బట్టి బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే, ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. కాని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడంతో ఎప్పుడూ ఖజానా ఖాళీగానే ఉండడంతో ఆయా భవన నిర్మాణాలకు సక్రమంగా నిధులను విడుదల చేయని పరిస్థితి ఏర్పడింది. దీంతో 2020, 2021 రెండేళ్లు ఆయా భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. చివరకు 2022లో కొంత మేరకు నిధులు విడుదల కావడంతో అరకొరగా భవన నిర్మాణాలు జరిగాయి. దీంతో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలపరిమితి పూర్తయినా భవన నిర్మాణాలు పూర్తికాలేదు.

212 భవనాలకు పూర్తయినవి 87 మాత్రమే..

ఏజెన్సీ వ్యాప్తంగా 212 సచివాలయాలకు గానూ ఇప్పటికి కేవలం 87 మాత్రమే పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 125 వివిధ స్థాయిలో ఉన్నాయి. ఉదాహరణకు జి.మాడుగుల మండలం కోరాపల్లి గ్రామ సచివాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో నెలకు రూ. 2,500 అద్దెకు ఓ రేకుల భవనాన్ని సమకూర్చుకుని అందులోనే సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే పాడేరు మండలంలో గుత్తులపుట్టులో సచివాలయ భవనం అసంపూర్తిగా ఉండడంతో పాత పంచాయతీ భవనంలోనే సచివాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అలాగే హుకుంపేట మండలం సంతారిలోనూ ... మిగతా 6వ పేజీలో

మన్యంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణ వివరాలు

మండలం	భవనాలు	పూర్తయినవి	అసంపూర్తిగా ఉన్నవి
అనంతగిరి	21	13	7
అరకులోయ	18	5	13
డుంబ్రిగుడ	16	1	15
హుకుంపేట	26	8	18
పెదబయలు	16	1	15
ముంచంగిపుట్టు	18	0	18
పాడేరు	16	13	3
జి.మాడుగుల	18	11	7
చింతపల్లి	22	10	12
జీకేవీధి	18	9	9
కొయ్యూరు	23	16	7
మొత్తం	212	87	125



ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి హోం మంత్రి పదవి దక్కించుకున్న తొలి నేతగా రికార్డు

- విపత్తుల నిర్వహణ శాఖ కూడా కేటాయింపు
- సర్వత్రా హర్షం

అనిత.. అరుదైన ఘనత

అనకాపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):

పాయకరావుపేట శాసనసభ్యురాలు వంగలపూడి అనితకు రాష్ట్ర మంత్రివర్గంలో కీలక శాఖ లభించింది. ఆమెకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హోం, విపత్తుల నిర్వహణ శాఖ కేటాయించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి హోం మంత్రిత్వ శాఖ దక్కించుకున్న తొలి వ్యక్తిగా ఆమె అరుదైన గుర్తింపుపొందారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఎంతోమంది మంత్రులుగా పనిచేశారు. అయితే హోం మంత్రిగా పనిచేసే అవకాశం మాత్రం ఎవరికీ లభించలేదు.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పాడేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన మత్స్యరాస మణికుమారి గిరిజన సంక్షేమ శాఖా మంత్రిగా పనిచేశారు. అలాగే సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు రోడ్లు, భవనాలు, అటవీ, పంచాయతీరాజ్ శాఖల మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా మరో టీడీపీ సీనియర్ నేత దాడి వీరభద్రరావు సమాచార శాఖా మంత్రిగా పనిచేశారు. మాడుగుల నియోజకవర్గానికి చెందిన రెడ్డి సత్యనారాయణ పశు సంవర్థక శాఖా మంత్రిగా, బండారు సత్యనారాయణ మూర్తి మునిసిపల్ మంత్రిగా, ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మానవ వనరుల మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చోడవరం ప్రాంతానికి చెందిన బలిరెడ్డి సత్యారావు నీటి పారుదల శాఖా మంత్రిగా, అనకాపల్లి చెందిన కొణతాల రామకృష్ణ వాణిజ్య పన్నుల శాఖా మంత్రిగా, పాడేరుకు చెందిన మత్స్యరాస బాలరాజు ప్రింటింగ్, స్టేషనరీ శాఖా మంత్రిగా, పసుపులేటి బాలరాజు గిరిజన సంక్షేమ శాఖా మంత్రులుగా పనిచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యాటక శాఖా మంత్రిగా,మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా, గుడివాడ అమర్‌నాథ్ పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రిగా పనిచేశారు. గతంలో చూస్తే..1967-1977లో భీమిలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన పీవీజీ రాజు విద్యాశాఖా మంత్రిగా, 1992లో పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన గుడివాడ గురునాథరావు సాంకేతిక శాఖా మంత్రిగా పనిచేశారు. 1983లో భీమిలి నుంచి టీడీపీ తరఫున గెలిచిన పూసపాటి ఆనందగజపతిరాజు విద్యా మంత్రిగా పనిచేశారు. 1989లో భీమిలి నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచిన ఆర్‌ఎస్‌డీపీ అప్పల నరసింహరాజు ఆబ్కారీ శాఖా మంత్రిగా పనిచేశారు. అయితే మొట్ట మొదటిసారి జిల్లాకు హోం మంత్రి పదవి లభించింది.


విషయ పరిజ్ఞానం...

వంగలపూడి అనిత ఉపాధ్యాయినిగా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి తొలిసారి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో పోటీ చేసి ఓటమి చవిచూసిన ఆమె.. ఈసారి పాయకరావుపేట నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించారు. రెండు రోజుల క్రితం కొలువుతీరిన కొత్త ప్రభుత్వంలో మంత్రిగా స్థానం దక్కించుకున్నారు. ఉపాధ్యాయినిగా పనిచేయడం ఆమెకు కలిసొచ్చింది. సామాజిక, రాజకీయ అంశాలపై ఆమెకు చక్కటి అవగాహన ఉంది. విషయ పరిజ్ఞానంతో సూటిగా మాట్లాడగలరు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న ఆమెను గత వైసీపీ ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టాలని యత్నించినా వెనక్కి తగ్గలేదు. ధైర్యంతో ముందడుగు వేశారు. వైసీపీ అరాచకాలు, పాలనాపరమైన వైఫల్యాలను గట్టిగా నిలదీశారు. ఎస్సీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమెపై వైసీపీ ప్రభుత్వం అప్పట్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి భయపెట్టే ప్రయత్నం చేసింది. అయినా ఆమె ఏమాత్రం జంకలేదు. అనిత పోరాట పటిమను గుర్తించిన టీడీపీ అధిష్ఠానం రాష్ట్ర మంత్రివర్గంలో హోం మంత్రిగా బాధ్యతలు అప్పగించిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

చంద్రబాబు పెద్ద మనస్సు

పాత పాఠ్యపుస్తకాల పంపిణీకి గ్రీన్‌సిగ్నల్

- జగన్, బొత్స పేర్లు, ఫొటోలున్నా పంపిణీ చేయాలని ఆదేశాలు
- ప్రజాధనం వృథా కాకూడదనే..





జగనన్న విద్యాకానుక అని ముద్రించిన బ్యాగ్‌లో దుస్తులు పంపిణీ

నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బేషజానికి దూరంగా ఉన్నారు. జగన్, బొత్స పేర్లు, ఫొటోలు ఉన్న పాఠ్య పుస్తకాల పంపిణీకి అనుమతి ఇచ్చారు. ప్రజాధనం వృథా కాకూడదనే ఉద్దేశంతో చంద్రబాబునాయుడు ఔదార్యం ప్రదర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభిస్తే.. పాఠ్యపుస్తకాల్లో మాజీ సీఎం, మాజీ విద్యా శాఖ మంత్రి ఫొటోలున్నా ప్రజాధనం ఆదా చేసేందుకు పెద్ద మనస్సుతో నూతన ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

చింతపల్లి, జూన్ 14: ప్రజాధనం కాపాడడంలో జగన్మోహన్‌రెడ్డికి పూర్తి భిన్నంగా నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసే పుస్తకాలు, చిక్కీ, గుడ్లు, బ్యాగ్, బెల్ట్‌లపై వైసీపీ ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి పేరు, చిత్రాలు ముద్రించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా సంబంధిత శాఖ అధికారులు, జగన్మోహన్‌రెడ్డి కనీసం పట్టించుకోలేదు. అయితే నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు పాఠ్యపుస్తకాల ముందు మాటల్లో జగన్మోహన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ పేర్లు ఉన్నప్పటికీ విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అనుమతించారు. తెలంగాణలో ఇదే తరహాలో పాఠ్యపుస్తకాల ముందు మాటల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, పూర్వ మంత్రుల పేర్లు ఉండగా అక్కడ ప్రభుత్వం పంపిణీని నిలిపివేసింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఆ పరిస్థితి రాకుండా నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. దీంతో ఈనెల 12 తేదీన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈనెల 13 తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అయితే విద్యార్థులకు పంపిణీకి సిద్ధం చేసిన పాఠ్యపుస్తకాల్లో రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి ముందు మాటల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణలపై ప్రశంసల జల్లు కురిపిస్తూ రాసిన వాక్యాలను ముద్రించారు. ప్రస్తుత ప్రభుత్వం మారడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించడంతో ఆ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వెనుకడుగు వేశారు. వారి పేర్లు తొలగించి మళ్లీ పాఠ్యపుస్తకాలను సిద్ధం చేయడం ఖర్చుతో కూడుకున్న పనిగా భావించిన చంద్రబాబునాయుడు అవే పాఠ్యపుస్తకాల పంపిణీకి అనుమతించారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చివేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం ... మిగతా 6వ పేజీలో

ఉరుములు, పిడుగులతో భారీ వర్షం

నైరుతి రుతుపవనాల ప్రభావమే కారణం

- తడిచి ముద్దయిన ఏజెన్సీ
- రోడ్లన్నీ జలమయం
- పొలాల్లోకి చేరిన వర్షం నీరు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు



అరకులోయలో కురుస్తున్న వర్షం

పాడేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో నైరుతి ప్రభావం కొనసాగుతున్నది. ఏజెన్సీ వ్యాప్తంగా శుక్రవారం ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెదబయలు మండలం సిరసపల్లి కూడలి వద్ద ఓ చెట్టుపై పిడుగు పడడంతో అక్కడ ఉన్న ఓ ఆవు మృతి చెందింది. ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సాధారణ వాతావరణం కొనసాగింది. ఆ తర్వాత నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణంలోని మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో కారుమబ్బులు కమ్ముకుని ఒక్కసారిగా ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం మొదలైంది. సమారుగా రెండు గంటల పాటు వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరులో ఒక మోస్తారు వర్షం కురవగా.. స్థానిక ఘాట్ మార్గంలో పలు మండలాల్లో మాత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలయమం కాగా పంట పొలాల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. తాజా వర్షాలు వేసవి దుక్కి పనులకు అనుకూలిస్తాయని రైతులు అంటున్నారు. అలాగే హుకుంపేటలోని రాళ్లగెడ్డ, పాడేరులోని బుంగాగెడ్డ, చిలకలమామిడిగెడ్డ, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మత్స్యగెడ్డ, డుంబ్రిగుడలో చాపరాయిగెడ్డ వర్షం నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏజెన్సీలో ముసురు వాతావరణం కొనసాగడంతో వాతావరణం చల్లబడింది.



పాడేరు మండలం మినుములూరులో రోడ్డుపై పారుతున్న వర్షం నీరు

పల్లాకు కీలక పదవి?

- రాష్ట్ర టీడీపీ అధ్యక్ష పదవికి ఆయన పేరును పరిశీలిస్తున్నట్టు సమాచారం
- అచ్చెన్నాయుడు స్థానంలో నియామకం
- అమరావతి నుంచి పిలుపు



-7వ పేజీలో..

మ్యూజియం పనులు వేగవంతం చేయండి : పీవో



చింతపల్లి మండలం లంబసింగిలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్ -వార్త 6వ పేజీలో..

మాట నిలబెట్టుకోవడం చంద్రబాబుకే సాధ్యం : గిడ్డి ఈశ్వరి



పాడేరులో వృద్ధులకు మిఠాయిలు పంచుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి - వార్త 6వ పేజీలో..



పి.మాకవరం కేంద్రంలో గ్రాడ్యుయేషన్ సరిఫికెట్లు ఇస్తున్న పీడీ

జిల్లాలోనే మోడల్ ప్రాజెక్టు కొయ్యూరు

» ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

కొయ్యూరు, జూన్ 14: జిల్లాలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోనే కొయ్యూరును మోడల్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దారని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి ప్రశంసించారు. స్థానిక ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలలో సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులతో సమావేశాలు నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలలో ఈసీసీఈ పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా ఐదేళ్లు పూర్తయిన అంగన్‌వాడీ విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందేందుకు వీలుగా గ్రాడ్యుయేషన్ సరిఫికెట్లను అందించారు. అనంతరం పలు కేంద్రాలను సందర్శించి, వాటి పనితీరుపై సమీక్షించారు. కేంద్రాలలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లాకే కొయ్యూరు ప్రాజెక్టు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. పీడీ వెంట సీడీపీవో విజయకుమారి, పలువురు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

చింతపల్లి కేంద్రంలో తనిఖీలు

చింతపల్లి: మండల కేంద్రంలోని ముత్యాలమ్మవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న పిల్లలకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ మూడేళ్లు నిండినబాలబాలికలకు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు పాఠశాలల్లో ఒకటోఎతరగతిలో చేరుతారన్నారు. వీరు ఇతర విద్యార్థుల కంటే విద్యలో మెరుగ్గా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమంగా రావడం వల్ల పాఠశాల అలవాటు పడుతుందన్నారు. మండలంలో 596 మంది విద్యార్థులు పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.విజయకుమారి, గౌహరున్నిషా, ఎస్.గౌరి, పి.అప్పలనర్సమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

అరకులో భారీ వర్షం

» విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయ, జూన్ 14: మండల కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గంటన్నరకు పైగా వాన పడడంతో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. పంట పొలాలు, రహదారులపై నీరు చేరింది. కొన్ని చోట్ల సిల్వర్‌ఓక్ చెట్లు కూలిపోయాయి. విద్యుత్ వైర్లు తెగి పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

హుకుంపేటలో...



హుకుంపేటలో కురుస్తున్న వర్షం

హుకుంపేట: మండలంలోని శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. దీంతో మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు చిత్తడిగా మారాయి. రెండు రోజులుగా ఎండలతో ఉక్కిరిబిక్కిరైన జనం ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

కుళ్లిన మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

» జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి నరసింహులు



ఓ దుకాణంలో మేక మాంసం పరిశీలిస్తున్న డాక్టర్ నరసింహులు

సీలేరు, జూన్ 14: చనిపోయిన, కుళ్లిన మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ చందక నరసింహులు హెచ్చరించారు. ఇటీవల మేకమాంసం విక్రయాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సీలేరులో మాంసం దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఈ సందర్భంగా దుకాణదారులకు హెచ్చరించారు. పంచాయతీ ఆధ్వర్యంలో మినీ కబేలాను నిర్మించి మేకలు వధించడానికి ముందు, తరువాత తనిఖీలు నిర్వహించడానికి సిబ్బందిని నియమిస్తామని ఆయన తెలిపారు. అలాగే బక్రీద్ సందర్భంగా జంతువులను వధించినా, అక్రమ రవాణాకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా జంతువులను వధిస్తే 9346304703, 9440223645 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, సిబ్బంది వెంకట్, అనుష్క తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయ భవనాలు



సంతారి సచివాలయం నిర్వహిస్తున్నది ఈ భవనంలోనే

... 5వ పేజీ తరువాయి

వేరే చిన్న భవనంలో సచివాలయ కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇలా ఏజెన్సీ వ్యాప్తంగా వివిధ స్థాయిలో సచివాలయ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఏజెన్సీ వ్యాప్తంగా 212 సచివాలయాల్లో ప్రస్తుతం 87 భవనాలు మాత్రమే పూర్తిగా అందుబాటులోకి రాగా.. 20 పూర్తయ్యే స్థాయిలో, 65 తుది దశలో, 28 రెండు శ్లాబ్‌ల స్థాయిలో, 10 తొలి స్లాబ్ వేయగా, 2 రూఫ్‌లెవల్‌లో ఉన్నాయి. ఆయా నిర్మాణాలకు సంబంధించిన నిధులు ఎప్పుడు విడుదలవుతాయనేది అధికారులకు సైతం అంతుబట్టక తలలు పట్టుకుంటున్నారు. దీంతో చేసేది లేక నిధులు ఎప్పుడు విడుదల చేస్తే అప్పుడే వాటి నిర్మాణాలను పూర్తి చేయాలనే ఆలోచనతో అధికారులు, కాంట్రాక్టర్లున్నారు. దీంతో ఏజెన్సీ వ్యాప్తంగా ఎక్కడిదక్కడ అసంపూర్తిగా భవనాలు ఉన్నాయి.

విద్యార్థులు గైర్హాజరైతే ఉపాధ్యాయులపై చర్యలు

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్



బాలిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

చింతపల్లి, జూన్ 14: పాఠశాలల్లో విద్యార్థుల పూర్తి స్థాయి హాజరు లేకపోతే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలో శుక్రవారం పీవో పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికలు, బాలుర ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల హాజరును స్వయంగా పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలని స్పష్టం చేశారు. ఈనెల 21తేదీలోగా ప్రతి విద్యార్థినీ, విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్లు డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటుచేసి గ్రామ సచివాలయం పరిధిలోని విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 8, 9 తరగతుల విద్యార్థులు పట్టుదలతో విద్యలో రాణించాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణ ప్రాముఖ్యమన్నారు. ఐటీడీఏ పరిధిలోని ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు పదో తరగతి విద్యార్థులను ఎంపికచేసి ఈ ఏడాది కూడా సూపర్-50 కింద ఉత్తమ శిక్షణ ఇస్తామన్నారు. ఐటీడీఏ పరిధి పది ఉత్తీర్ణులైన విద్యార్థులు మారికవలస కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అధికంగా సీట్లు సాధించారన్నారు. వచ్చే ఏడాది కూడా గిరిజన విద్యార్థులు సీట్లు సాధించాలనే లక్ష్యంతో విద్యను అభ్యసించాలన్నారు. నర్సరీ స్థాయి ఆంగ్ల పదాలను విద్యార్థులు చెప్పలేకపోతున్నారని, విద్యార్థుల్లో ఆంగ్ల భాష ప్రమాణాలు మెరుగుపడాలని ఆయన చెప్పారు.

మ్యూజియం పనులు వేగవంతం చేయండి

లంబసింగిలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండల పర్యటలో భాగంగా తొలుత తాజంగి పంచాయతీ కేంద్రంలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.35 కోట్ల ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న మ్యూజియంలో సివిల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దుకాణ సముదాయం, యాంపీ థియేటర్, రెస్టారెంట్ పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న బ్లాక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణయిత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, ఉప సంచాలకులు కొండలరావు, ఏటీడబ్ల్యూవో జగ నాగలక్ష్మి, ఎంఈవో-1, 2 పనసల ప్రసాద్, బోడం నాయుడు, డీఈఈ చాణిక్యరావు, ఏఈఈ యాధకిశోర్, హెచ్ఎంలు జేపీ కొండలరావు, సాగిన రామరాజు పాడాల్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవడం చంద్రబాబుకే సాధ్యం

ఒకేసారి పింఛన్ రూ.వెయ్యి పెంచిన బాబు

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరులో సందడిగా ఐదు సంతకాల సంబరాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి.. పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పాడేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే సాధ్యమని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన ఐదు హామీల ఫైళ్లపై సంతకాలు చేసిన సందర్భంగా ఇక్కడ నిర్వహించిన సంబరాల్లో ఆమె మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయలేదని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేవలం 6,100 పోస్టులతో మొక్కుబడిగా డీఎస్సీ ప్రకటన చేసి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. కాని చంద్రబాబునాయుడు అందుకు భిన్నంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా తన తొలి సంతకాన్ని 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఫైల్ పైనే సంతకం చేశారన్నారు. అలాగే 2019లో జగన్ పెన్షన్‌ను రూ.2వేలు నుంచి రూ.3 వేలు పెంచేందుకు ఐదేళ్లు పట్టిందన్నారు. ఈవిధంగా జగన్ అవ్వాతాతలను మోసం చేశారని ఈశ్వరి ఆరోపించారు. కాని చంద్రబాబునాయుడు ఒకేసారి పెన్షన్‌ను రూ.వెయ్యి పెంచారని, పేదలకు రూ.5 భోజనం పెట్టే అన్నా క్యాంటీన్లను జగన్ మూసివేయిస్తే, టీడీపీ ప్రభుత్వం వాటిని తెరిపించి పేదల ఆకలిని తీర్చుతుందన్నారు. అలాగే నిరుద్యోగ యువతలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే సీఎం నైపుణ్య గణనకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అలాగే తమ భూమిని జగన్ పరోక్షంగా లాక్కునేందుకు ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని వినియోగించుకోవడాన్ని చంద్రబాబు రద్దు చేశారని గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. అన్నమాట ప్రకారం సీఎంగా తొలి రోజు వాటికి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, యువతకు గిడ్డి ఈశ్వరి మిఠాయిలు తినిపించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, నేతలు డి.వెంకటరమణ, బి.విజయరాణి, జి.సింహాచలం, కె.రమేశ్‌నాయుడు, ఎల్.పార్వతమ్మ, అధిక సంఖ్యలో యువత, పలు పథకాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా జవహర్

మోతుగూడెం, జూన్ 14: చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్‌గా జవహర్‌ను పదోన్నతిపై నియమిస్తూ విజయవాడ విద్యుత్ సౌధ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఉన్న బొడ్డు శ్రీధర్‌ను విద్యుత్ సౌధలోని ట్రైనింగ్ సెంటర్‌కి బదిలీ చేశారు. నూతనంగా నియమితులైన జవహర్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ సివిల్ కె.ప్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ వరప్రసాద్, డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.విజయ్ కుమార్‌లు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి



నాగబాబు మృతదేహం

రాజవొమ్మంగి జూన్ 14: రాజవొమ్మంగి మండలంలో శుక్రవారం వర్షం వస్తుందని చెట్టు కింద ఆగిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన ఇది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లాగరాయి గ్రామానికి చెందిన కొల్లి నాగబాబు (30), పెంటకోట దేవకిరణ్ (23) ఏలేశ్వరం నుంచి లాగరాయి వెళుతూ మార్గమధ్యలో వర్షం వస్తోందని లబ్బర్తి గ్రామ సమీపంలో చెట్టు కింద ఆగారు. కాసేపటికి చెట్టుపై పిడుగు పడడంతో నాగబాబు అక్కడికక్కడే మృతి చెందగా, కిరణ్‌కు గాయలవడంతో స్థానికులు లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పూలుగుడలో గిరిజనుడికి అస్వస్థత

డుంబ్రిగుడ, జూన్ 14: మండలంలోని కితలంగి పంచాయతీ పూలుగుడ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు పడడంతో గ్రామానికి చెందిన తాంగుల బాబూరావు అస్వస్థతకు గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరిన అతన్ని కుటుంబీకులు గమనించి ప్రైవేటు వాహనంలో హుటాహుటిన డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్సను అందించిన వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవల కోసం అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో బాధిత గిరిజనుడికి అంబులెన్స్‌లో అక్కడికి తరలించారు.

హామీ లేకుండానే గ్రామం ఖాళీ చేయమంటున్నారు..

» జెన్‌కో అధికారులపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

సీలేరు, జూన్ 14: సీలేరులో కొత్త ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ గ్రామాన్ని ఖాళీ చేయాలని ఏపీ జెన్‌కో అధికారులు వేధిస్తున్నారని సీలేరు పంచాయతీ పరిధిలోని పార్వతీనగర్‌కు చెందిన గిరినులు గూడెంకొత్తవీధి తహసీల్దార్‌ను శుక్రవారం ఫిర్యాదు చేశారు. తాము 15 ఏళ్లుగా పార్వతీనగర్‌లో సొంతంగా ఇళ్లు నిర్మించుకుని, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, ప్రస్తుతం సీలేరులో కొత్త ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రామం ఖాళీ చేయాలని జెన్‌కో అధికారులు పదేపదే ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామం ఖాళీ చేయాలంటే ప్రాజెక్టులో తమ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్యం, నీటి సుదపాయాలు కల్పించాలని, నష్టపోయిన కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, వీటిపై లిఖితపూర్వకంగా హామీ ఇస్తే తప్ప ఖాళీ చేసేది లేదని గిరిజనులు పేర్కొన్నారు.

చంద్రబాబు పెద్ద మనస్సు

... 5వ పేజీ తరువాయి

వృథా అయ్యిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నూతన ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు ఎక్కడా ప్రచార ఆర్భాటం, పంతానికి వెళ్లకుండా పాఠ్యపుస్తకాలను యథావిధిగా పంపిణీ చేయడానికి అనుమతించి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఆఖరికి విద్యార్థులకు పంపిణీ చేసే దుస్తులు సైతం జగనన్న విద్యాకానుక అని రాసిన పాత బ్యాగులతోనే విద్యాశాఖ అధికారులు పంపిణీ చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రితో పాటు టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఎక్కడా అడ్డు చెప్పడం లేదు.

ఏపీ ఫైబర్‌లో ఏబీఎన్ ప్రసారాలు



ఫైబర్ నెట్‌వర్కులో వస్తున్న ఏబీఎన్ న్యూస్

చింతపల్లి, జూన్ 14: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీ ఫైబర్‌లో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ప్రసారాలు పునఃప్రారంభమయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతీ కుటుంబానికి తక్కువ ధరకు ఇంటర్నెట్, టెలిఫోన్, టీవీ ఛానళ్లు అందించాలనే సదుద్దేశంతో ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చారు. అప్పటిలో అన్ని రకాల ఛానళ్ల ప్రసారాలు జరిగేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి', 'టీవీ-5' ఛానళ్ల ప్రసారాలను నిలిపి వేసింది. 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' చానల్ ప్రసారాల కోసం అదనపు చార్జీ వసూలు చేసినప్పటికీ వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ఈ నెల 13వ తేదీ నుంచి ఏపీ ఫైబర్‌లో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి', 'టీవీ-5' ఛానళ్ల ప్రసారాలను అధికారులు పునఃప్రారంభించారు. ఏపీ ఫైబర్‌లో ప్రస్తుతం 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' 55వ నంబర్‌లో ప్రసారం జరుగుతున్నది.

90 శాతం పుస్తకాల పంపిణీ: ఎంఈవో ప్రసాద్



ఉపాధ్యాయులకు విద్యా కిట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, జూన్ 14: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు 90 శాతం పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశామని ఎంఈవో పనసల ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్‌లో శుక్రవారం ఉపాధ్యాయులకు విద్యా కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 213 పాఠశాలలకు పూర్తి స్థాయిలో పుస్తకాలు, దుస్తులు అందజేశామన్నారు. ఏడో తరగతిలో కొన్ని పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగ్, బెల్ట్, షూ రావాల్సి ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడంనాయుడు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎస్ఐ రేకుల వితరణ

సీలేరు, జూన్ 14: దుప్పులవాడ పంచాయతీలోని వలసపల్లి గ్రామంలో పాఠశాల భవనానికి అవసరమైన రేకులను సీలేరు ఎస్ఐ రామకృష్ణ రేకులను శుక్రవారం సమకూర్చి ఉదారతను చాటుకున్నారు. పాఠశాల భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అటవీ శాఖ అభ్యంతరాలతో నిలిచిపోయింది. దీంతో విద్యార్థులకు పాఠశాల భవనం లేకచెట్ల కిందనే చదువుకోవడంతో ఎండకు, వానకు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ, పాఠశాల నిర్వహణకు తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణానికి సహాయ సహకారాలు అందించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీకి చర్యలు

అరకులోయ, జూన్ 14: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీకి చర్యలు చేపడుతున్నామని ఎంఈవో భారతీరత్నం తెలిపారు. మండలంలో 168 ప్రాథమిక, 12 ఆశ్రమోన్నత పాఠశాలల్లో 10444 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరందరికీ ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు, బ్యాగులు తదితర సామగ్రి పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే 60 శాతం మేరకు పాఠశాలలకు సరఫరా చేశామన్నారు. ఇంకా 20 శాతం సరకు రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే వాటిని కూడా పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.



పాఠ్య పుస్తకాలు ఎంపిక చేసుకుంటున్న ఉపాధ్యాయులు

☛ సంక్షిప్తంగా..

రక్తదానానికి ముందుకురండి

» డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు

గూడెంకొత్తవీధి, జూన్ 14: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు పిలుపునిచ్చారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశాల మేరకు శుక్రవారం చేయూత వారియర్స్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 48 మంది యువకులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల నష్టం ఉండదన్నారు. ఆరోగ్యవంతమైన ప్రతి వ్యక్తి రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానం చేయడం వల్ల మరో ప్రాణాన్ని కాపాడవచ్చునన్నారు. రక్తదానం చేసిన యువకులకు చింతపల్లి వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు వ్యక్తిగత నిధులతో జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి దిలీప్ కుమార్, చేయూత వారియర్స్ చైర్మన్ దూనబోయిన రమణ, మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు మడపల సోమేశ్‌కుమార్, ఎస్సై అప్పల సూరి పాల్గొన్నారు.

వారసత్వ భూములను మ్యూటేషన్ చేయించుకోవాలి

చింతపల్లి, జూన్ 14: గిరిజనులు వారసత్వ భూములను మ్యూటేషన్ (పట్టా మార్పిడి) చేయించుకోవాలని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కేంద్రంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజనుల నుంచి వివిధ భూ సమస్యల అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. ఈ సంరద్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చే భూములను కుటుంబ సభ్యులు పట్టామార్పిడి చేసుకోవాలన్నారు. పట్టాలను మ్యూటేషన్ చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాలు అందవన్నారు. అలాగే భూమిపై హక్కు ఉండదన్నారు. తల్లిదండ్రుల భూములకు కుటుంబంలోని స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత పాల్గొన్నారు.

జీవో నంబరు-3 పునరుద్ధరించాలి

చింతపల్లి, జూన్ 14: గిరిజన నిరుద్యోగ యువతకు శతశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నంబరు-3 పునరుద్ధరించే బాధ్యత గిరిజన ఎమ్మెల్యేలు తీసుకోవాలని భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీవో నంబరు-3ని 2000సంవత్సరం ఏప్రిల్ 10న నాడు ముఖ్యమంత్రిగానున్న చంద్రబాబు అమలుపర్చారన్నారు. అప్పటిలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా మత్స్యరాస మణికుమారి పనిచేశారన్నారు. 2022 ఏప్రిల్ 22న దేశ అత్యున్నత న్యాయ స్థానం జీవోను రద్దు చేసిందన్నారు. అరకులోయ వచ్చిన చంద్రబాబు అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీతోపాటూ జీవో నంబరు-3 పునరుద్ధరిస్తామని హామి ఇచ్చారన్నారు. మెగా డీఎస్సీ హామిని ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే నిలబెట్టుకున్నారన్నారు. ఈడీఎస్సీలోనూ జీవో నంబరు-3 రద్దు కావడం వల్ల అధిక ఉద్యోగాలను గిరిజనులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైన గిరిజన ఎమ్మెల్యేలు స్పందించి జీవో నంబరు-3 పునరుద్ధరణకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లాలన్నారు.

హామీలు నిలబెట్టుకున్న ప్రభుత్వం

» టీడీపీ డివిజన్ నేత పాండురంగస్వామి

ముంచంగిపుట్టు, జూన్ 14: ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం నిలబెట్టుకున్నదని టీడీపీ పార్టీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి అన్నారు. ఆ పార్టీ కార్యకర్తలతో ఆయన గురువారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ చట్టం, పెన్షన్ పెంపు, అన్నా క్యాంటిన్లు, నైపుణ్య గణన ఫైళ్లపై మొదటి సంతకాలు చేయడం అర్హనీయని అన్నారు. డీఎస్సీతో నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ సమయంలో నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చీరాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఐదు హామీలను అమలు చేయడం ఎంతో ఆనందదాయకమని, రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగుతు పెట్టనున్నాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.రామస్వామి, ఆ పార్టీ నాయకులు బాబూజీ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో రేపటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు



హుకుంపేట, జూన్ 14: మండల కేంద్రంలో మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఆదివారం నుంచి నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు మండల కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయంలో ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. మూడు రోజులు భక్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణిమ, వైస్ సర్పంచ్ గోవింద్, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాద్, నాగు, నానాజీ, శివరామకృష్ణ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు వాహనం మొరాయింపు



డుంబ్రిగుడ, జూన్ 14: మండలంలోని అరకు సంతబయలులో ప్రధాన రాహదారిలో అరకు ఫారెస్ట్ అధికారుల వాహనం మొరాయించింది. దీంతో రోడ్డుకు ఇరువులా వాహన రాకపోకలకు సమస్యలు తలెత్తింది. అలాగే ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఫారెస్ట్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా సుమారు నాలుగు గంటల పాటుగా వాహనాన్ని రోడ్డుపైనే నిలిపి వేయడంతో పలు వాహన చోదకులు ఇబ్బందులు పడక తప్పలేదు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ వాహనాలు మరమ్మతులకు గురైతే తక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యధోరణి అవలంబించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రైం... crime news

యువతి ఆత్మహత్య


మృతి చెందిన రాధమ్మ

కొయ్యూరు, జూన్ 14: చిన్న తనంలోనే తల్లిని, కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో తమ్ముడ్ని, పెంచి పెద్ద చేసిన నాన్నమ్మను కోల్పోయిన బాధను తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. కొయ్యూరు మండలంలోని మఠం భీమవరం పంచాయతీ బొడ్డుమామిడి గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. బొడ్డుమామిడి గ్రామానికి చెందిన కోండ్ల రాధమ్మ (18) ఈ నెల 12న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఇది గుర్తించిన స్థానికులు హుటాహుటిన రంపచోడవరం సీహెచ్‌సీకు తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవలు అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో గురువారం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్క వైద్యులు పరీక్షించి అప్పటికే రాధమ్మ మరణించినట్టు ధ్రువీకరించారు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న రాధమ్మకు చిన్నతనంలోనే తల్లి మరణించింది. తల్లి మరణానంతరం తండ్రి మరో వివాహం చేసుకుని వేరే చోట ఉంటున్నాడు. దీంతో రాధమ్మ, ఆమె తమ్ముడు కలిసి నాన్నమ్మ పోషణలో పెరిగారు. కొన్ని రోజుల క్రితం తమ్ముడు అనారోగ్యం బారిన పడి చనిపోయాడు. దీంతో నాన్నమ్మతో పాటు రాధమ్మ ఉండేది. గత నెలలో నాన్నమ్మ కూడా మరణించింది. దీంతో రాధమ్మ ఒంటరిగా ఉంటూ నిత్యం మదనపడుతూ ఉండేది. ఈ బాధను తట్టుకోలేని రాధమ్మ ఆత్మహత్యయత్నానికి పాల్పడి వైద్య సేవలు పొందుతూ మృతి చెందింది. స్థానికుల పిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన రాధమ్మకు పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

అనకాపల్లి టౌన్, జూన్ 14 : ఇక్కడి రింగురోడ్డులోని లక్ష్మీనారాయణనగర్ జంక్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు.. వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందిచారు. ఎస్ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 45ఏళ్లు ఉంటుందన్నారు. నీలంరంగు గళ్ల చొక్కా, నీలిరంగు షర్టు ధరించి ఉన్నాడని వివరించారు. ఇంతకు మించి అతని వద్ద మరే ఇతర ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

వాతావరణంలో మార్పులకు అనుగుణంగా పంటల సరళి మారాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏడీఆర్

అనకాపల్లి అగ్రికల్చర్ 14 : వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా రైతులు పంటల సరళిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు సూచించారు. ఇక్కడి ఆర్ఏఆర్ఎస్‌లో పంటలపై వాతావరణ ప్రభావం అనే అంశంపై శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పులపై వారానికి రెండుసార్లు రైతుల కోసం ప్రత్యేకంగా ఆర్ఏఆర్ఎస్ విడుదల చేస్తున్న సమాచారాన్ని రైతులు అనుసరించాలని సూచించారు. విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సునంద మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పులు పంటలను ఏవిధంగా ప్రభావితం చేస్తాయనే అంశాన్ని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు, చెరుకు ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, డాక్టర్ వి.గౌరీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంటలపై వాతావరణ ప్రభావం అనే పుస్తకాన్ని డాక్టర్ జగన్నాథరావు ఆవిష్కరించారు.

విద్యార్థిని కుసుమకు అభినందనలు

పరవాడ, జూన్ 14: రావాడ పంచాయతీ ధర్మారాయుడుపేట హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కోన కుసుమ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపి కైంది. ఇటీవల ఈ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని కుసుమకు సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, హెచ్ఎం వి.సన్యాసినాయుడు, పూర్వపు హెచ్ఎం ప్రసన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

పుస్తకాల పంపిణీ

అనకాపల్లి టౌన్, జూన్ 14: గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం పుస్తకాల పంపిణీ చేపట్టారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ పంపిణీని ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులు మరింత శ్రద్ధతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. హెచ్ఎం డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లాకు కీలక పదవి?

రాష్ట్ర టీడీపీ అధ్యక్షునిగా పేరును పరిశీలిస్తున్నట్టు సమాచారం

అచ్చెన్నాయుడు స్థానంలో నియామకం.. అమరావతి నుంచి పిలుపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఇటీవల జరిగిన ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావుకు పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది. తొలుత ఆయనకు మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే ఆ సామాజిక వర్గంలో వేరే వారిని తీసుకోవడంతో ఆయనకు అవకాశం లభించలేదు. ఈ నేపథ్యంలో పార్టీ పగ్గాలు అప్పగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా పల్లా శ్రీనివాసరావును నియమించాలని చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

ప్రస్తుతం రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నారు. ఆయన్ను ఇప్పుడు మంత్రివర్గంలోకి తీసుకొని వ్యవసాయ శాఖ అప్పగించారు. దాంతో పార్టీ బాధ్యతలను బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికే ఇవ్వాలని అధిష్ఠానం భావించింది. పల్లా శ్రీనివాసరావు గత ఐదేళ్లు విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షునిగా సమర్థంగా పనిచేశారు. అందరినీ కలుపుకొని వెళుతూ, ప్రతిపక్ష పార్టీతో నువ్వా?, నేనా?...అన్నట్టు పోరాడడంతో ఆయన సేవలను అధిష్ఠానం గుర్తించింది. శుక్రవారం పార్టీ కార్యాలయం నుంచి పిలుపు రావడంతో పల్లా విజయవాడ బయలుదేరి వెళ్లారు. రాత్రికి చంద్రబాబునాయుడును కలిసి మాట్లాడే అవకాశం ఉంది.

తెలుగుదేశం కుటుంబం

పల్లా శ్రీనివాసరావు కుటుంబానికి మొదటి నుంచి తెలుగుదేశం పార్టీతో అనుబంధం ఉంది. తండ్రి సింహాచలం కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ నాయకుడు. గాజువాక సర్పంచి స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారు. విశాఖ-2 ఎమ్మెల్యేగా 1994-1999 వరకు చేశారు. పల్లా శ్రీనివాస్ ఆ తరువాత రాజకీయాల్లో వచ్చారు. చిరంజీవి ప్రారంభించిన ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009లో విశాఖ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో గాజువాక ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో జరిగిన ముక్కోణపు పోటీలో పవన్‌కళ్యాణ్, తిప్పల నాగిరెడ్డిలతో గాజువాక నుంచి తలపడ్డారు. 2024లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై పోటీ చేసి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ (95,235 ఓట్లు)తో గెలుపొందారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

జనరంజక పాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యం

- ఎమ్మెల్యే పంచకర్ల, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ వెల్లడి
- చంద్రబాబు తొలి ఐదు సంతకాలపై సంబరాలు
- కూటమి అధినేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం


ఒకరికి ఒకరు కేక్ తినిపించుకుంటున్న పంచకర్ల రమేష్, గండి బాబ్జీ

సబ్బవరం, జూన్ 14: రాష్ట్రంలో జనరంజక పాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు కీలక హామీల అమలు ఫైలుపై సంతకాలు చేయడం పట్ల కూటమి నేతలు శుక్రవారం ఇక్కడి ఎన్టీఆర్ కూడలిలో సంబరాలు జరుపుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ బాబు, పవన్ చర్చించుకుని తొలుత ముఖ్యమైన మెగా డీఎస్సీ, వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పింఛన్ల పెంపు, తదితర ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఐదేళ్లలో పరిష్కరిస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లే కదా.. కళ్లుమూసుకుంటే గడిచిపోతుందని మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి అన్నివర్గాల మన్ననలు పొందుతామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ మొదటి రోజే ఐదు హామీలు నెరవేర్చడం చరిత్ర అన్నారు. రైతులను అభద్రతాభావానికి గురిచేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ కూటమి నాయకులు గొర్లి రామునాయుడు, కర్రి నర్సింగరావు, పైల జగన్నాథరావు, బర్నికాన బాబూరావు, ఎం.మహాలక్ష్మినాయుడు, ఇందలి రమణ, వియ్యపు చిన్నా, గండి ముత్యాలనాయుడు, కోటాన అప్పారావు, బంతికోళ్ల పద్మ, శీరం అప్పరాజు, కర్రి కనకరాజు, కోరాడ శ్రీనులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పాటు

- జగన్ ప్రజా వ్యతిరేక విధానాలకు ఓటుతో బుద్ధి
- వైసీపీ పాలనలో శాఖల వారీ అక్రమాలు, భూకబ్జాలపై విచారణ చేపట్టాలి
- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి

అనకాపల్లి టౌన్, జూన్ 14: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల ఆస్తులను రాష్ట్ర వ్యాప్తంగా కబ్జా చేయాలనే దురుద్దేశంతో జగన్ ప్రవేశపెట్టిన భూ యాజమాన్య చట్టాన్ని చంద్రబాబు రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో ఉన్న తమ ఆస్తులను జగన్ కబ్జా చేస్తారనే భయంతో రాష్ట్ర ప్రజలే కాకుండా ఇతర దేశాల్లో ఉన్న తెలుగువారు కూడా తమ సొంత ఖర్చులతో వచ్చి జగన్‌ను ఓడించడానికి ఓటు వేశారన్నారు. ఈ చట్టం ప్రకారం వైసీపీ నాయకులకు భూ కబ్జాలను చేసే అధికారం ఇచ్చి, సివిల్ కోర్టులకు కూడా అధికారాలను తొలగించారన్నారు. ప్రపంచం మొత్తం మీద కోర్టులకు అధికారాలను తొలగించిన ఏకైక నాయకుడు జగన్ అని ఎద్దేవా చేశారు. ప్రజల పేదరికాన్ని గుర్తించి రూ.మూడు వేల పింఛన్‌ను రూ.నాలుగు వేలకు పెంచుతూ దీనికి ఎన్టీఆర్ భరోసా అనే పేరు పెట్టడం గొప్ప విషయమన్నారు. గత శాసనసభ ఎన్నికల ముందు మెగా డీఎస్సీ పెడతామని హామీ ఇచ్చిన జగన్, డీఎస్సీ పెట్టలేదు సరికదా.. సుమారు 10వేల గ్రామ స్థాయి ప్రాథమిక పాఠశాలలను నిర్లక్ష్యంగా మూసివేశారన్నారు. చంద్రబాబు ఒకేసారి 16,347 ఉపాధ్యాయ ఉద్యోగులను నియమించడానికి మెగా డీఎస్సీ ప్రకటించడం నిరుద్యోగులకు ఒక వరమన్నారు. క్రమంగా పరిపాలన వ్యవహారాలను శాఖల వారీగా సమీక్షించి, గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలను, భూకబ్జాల పై విచారణ జరిపించి సంబంధిత అధికారుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా పంచకర్ల జన్మదిన వేడుకలు

- అధికసంఖ్యలో హాజరైన కూటమి శ్రేణులు


జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్‌కు బర్త్ డే కేకు తినిపిస్తున్న మాజీ ఎంపీపీలు జగన్నాథరావు, అప్పలనాయుడు

పరవాడ, జూన్ 14: మండల కేంద్రం పరవాడలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద గురువారం రాత్రి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు అధికసంఖ్యలో హాజరయ్యారు. జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని బర్త్ డే కేకును కట్ చేశారు. మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్‌లు సిరపురపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరు సన్యాసినాయుడు, ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ సర్పంచ్‌లు బొండా తాతారావు, రాయవరపు దేముడు, జనసేన నాయకులు దుల్ల రామునాయుడు, పెద్దిశెట్టి సత్యారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ వేడుకను పురస్కరించుకుని తానాం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు వర్రి పరదేశినాయుడు ఆధ్వర్యంలో భరిణికంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వరివిత్తనాల పంపిణీలో 'సూపర్లు' పెత్తనం


విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి తదితరులు

చీడికాడ, జూన్ 14: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సమయంలో చీడికాడ మండలంలో అధికారులు నిబంధనలు పాటిం చలేదనే విమర్శలు వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వరివిత్తనాలు తీసుకునేందుకు మహిళ ప్రజాప్రతినిధులతో కాకుండా వారి కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. మండలంలో 13 రైతుభరోసా కేంద్రాలకు వరి విత్తనాలు వచ్చాయి. ఖండివరం రైతుభరోసా కేంద్రం వద్ద శుక్రవారం వరి విత్తనాలను రైతులకు సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మికి బదులుగా ఆమె కుమారుడు ఎఫ్‌వీఎస్ నాయుడు, ఎంపీటీసీ గెంజి స్వాతికి బదులుగా ఆమె భర్త గెంజి బాలాజీతో పాటు టీడీపీ, వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, బండారు దయాకర్, సింగంపల్లి పెదనాయుడు, సుంకర కొండబాబుతో పాటు మైనార్టీ ఎంపీటీసీ షేక్ సూర్య నారాయణలు పంపిణీ చేశారు. అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.వీర్రాజు, వ్యవసాయ సిబ్బంది కె.శ్రీవిద్య పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం పాఠశాలను సందర్శించిన డీఈవో


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో

కొత్తూరు, జూన్ 14: అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తారక రామాకాలనీలో జరుగుతున్న ఆరు గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ప్రభు త్వం సరఫరా చేసిన పుస్తకాలను పంపిణీ చేశారు. మానిటరింగ్ అధి కారి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం. బాపునాయుడు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వారాధి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పంచకర్ల' కృతజ్ఞత సమావేశం

పరవాడ, జూన్ 14: పెందుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేష్‌బాబు శనివారం ఉదయం పది గంటలకు పరవాడలోని పార్టీ కార్యాలయం వద్ద కృతజ్ఞత సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు హాజరు కావాలని రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు కోరారు.

బావిలో పడిపోయిన కణుజు

- రెండు గంటలు శ్రమించి తీసిన అగ్నిమాపక సిబ్బంది


బావి నుంచి కణుజును బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎలమంచిలి, జూన్ 14 : మండలంలోని ములకలా పల్లి సమీపంలో గల వ్యవసాయ బావిలో శనివారం ఓ కణుజు ప్రమాదవశాత్తు పడిపోయింది. ఇది గుర్తించిన రైతులు దానిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఇంతలో కొందరు అగ్నిమాపక శాఖాధికారి రాంబాబుకు సమాచారం అందించారు. సిబ్బందితో ఆయన అక్కడికి చేరుకోవడంతో పాటు అటవీ అధికారి బీవీ రమణకు ఈ విషయాన్ని తెలియజేశారు. చివరకు రెండు గంటల పాటు శ్రమించి దానిని ప్రాణాలతో బయటకు తీశారు. అనంతరం అధికారులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో దానిని విడిచిపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని వీక్షించారు.

సిమ్, ల్యాండ్‌లైన్ నంబర్లకు చార్జీలు వద్దు

అనకాపల్లి టౌన్, జూన్ 14: కొత్త మొబైల్, ల్యాండ్ లైన్ నంబర్లకు చార్జీలు విధించే ప్రతిపాదనలను టెలికాం నియంత్రణాధికార సంస్థ (ట్రాయ్) విరమించుకోవాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆర్థిక వనరులుగా ఫోన్ నంబర్ల కేటాయింపును భావించడం తగదన్నారు. ఈ మేరకు ట్రాయ్‌కు పంపిన లేఖను శుక్రవారం ఆయన ప్రసార మాధ్యమాలకు విడుదల చేశారు. గతేడాది డిసెంబరులో పార్లమెంటు ఆమోదించిన టెలికాం చట్టంలో ఉన్న మొబైల్ నంబరుకు చార్జీ వసూలు చేయాలన్న నిబంధనను తొలగించాలని కోరారు.

ఏయూ వీసీపై న్యాయ విచారణ జరపాలి

- గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ డిమాండ్

విశాఖపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డిపై న్యాయ విచారణ జరపాలని కోరుతూ ఏయూ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ శుక్రవారం నిరశన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా నిరంకుశ పాలనకు వర్సిటీ నిలయంగా మారిందని విమర్శించారు. అడ్డగోలు వ్యవహారాలతో ఏయూను భ్రష్టు పట్టించిన ప్రసాదరెడ్డి తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏయూలో రద్దు చేసిన 28 సబ్జెక్టులను వెంటనే పునరుద్ధరించాలని, తొలగించిన గెస్ట్ ఫ్యాకల్టీని తిరిగి తీసుకోవాలన్నారు. నోటిఫికేషన్ లేకుండా నియమించిన అనుబంధ, ఇతర ప్రొఫెసర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తొలగించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఆయనకు మద్దతుగా డాక్టర్ అర్జున్, చింతాడ శ్రీను, డాక్టర్ సూరి, డాక్టర్ రాము దీక్షలో పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై న్యాయవాదుల హర్షం


ఎల్‌టీ యాక్ట్ రద్దుపై హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

చోడవరం, జూన్ 14: ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చారిత్రక నిర్ణయంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కృష్ణవేణి పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల కలిగే దుష్ఫలితాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన న్యాయవాదుల పోరాటానికి చట్టం రద్దుతో తగిన ఫలితం లభించినట్టయిందన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు అల్లు గిరిధర్, గూనూరు లక్ష్మీనారాయణ, కొల్లి శ్రీనివాస్, చీపురుపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు

నర్సీపట్నం, జూన్ 14: ప్రైవేటు పాఠశాలలలో అధిక ఫీజులు వసూలు చేయడం, పుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు విక్రయిస్తున్నారంటూ ఫిర్యాదులు అందడంతో ఎంఈవో-1 తలుపులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం పట్టణంలో ఐదు ప్రైవేటు పాఠశాలలో ఆయన తనిఖీ చేశారు. ప్రైవేటు పాఠశాలలలోని పుస్తకాల గోదాములను పరిశీలించారు. యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు, ఇతర స్టేషనరీ సామాగ్రి పాఠశాల ఆవరణలో విక్రయించ కూడదని యాజమాన్యాలకు హెచ్చరించారు. పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఆర్‌టీఐతో వినియోగదారుల సమస్యలు పరిష్కారం'


విద్యార్థికి ఉపకార వేతనం అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూన్ 14: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా వినియోగదారులు తమ హక్కులను పరిరక్షించుకోవచ్చునని ఆర్‌టీఐ చట్టం రిసోర్స్‌పర్సన్ కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రశ్నించేతత్వం పెరిగిన కొద్దీ ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరుగుతుందన్నారు. అయితే ప్రశ్నించే హక్కు ఉంది కదా.. అని బాధ్యతలు విస్మరించరాదన్నారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. కోరుకున్న సమాచారాన్ని సూటిగా, స్పష్టంగా దరఖాస్తుదారులు కోరాలన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో క్లబ్ కార్యదర్శి బి.అప్పలరాజు, సభ్యులు డి.జగన్నాథరావు, ప్రకాష్‌గుప్తా, పూసర్ల సుధీర్, బి.పద్మరాజు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ జి.సుబ్రం మెమోరియల్ ట్రస్ట్ నుంచి పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేశారు.

'పాడి రైతులకూ బీమా సౌకర్యం'

అచ్యుతాపురం, జూన్ 14: పశువులతో పాటు వాటిని పెంచిన రైతుకు కూడా బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మండలంలోని గొల్లలపాలెంలో శుక్రవారం జరిగిన పాడి రైతుల అవగాహన సదస్సులో మాట్లాడారు. పాడి రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణానికి రూ.50 వేలు బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. పశువులకు కేవలం రూ.50కే కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్‌లు ఇస్తున్నట్టు చెప్పారు. అలాగే అన్ని డెయిరీలు కన్నా పాలుకి అధిక ధర ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రాము, సూపర్‌వైజర్ గోవిందు, వెంకట్రావు, మధు, వరలక్ష్మి పాల్గొన్నారు.

'సమాజ శ్రేయస్సుకు పాటుపడదాం'

అచ్యుతాపురం, జూన్ 14: ఇంట్లోనే కులం అని, ఇంటి బయట మనమంతా బంధువులం, హిందువులం అని సమరసత సేవా ఫౌండేషన్ ఖండ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. మండలంలోని తంతడి, గండివానిపాలెంలలో శుక్రవారం ధర్మప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కులదైవాన్ని పూజించి, గురువులను గౌరవిస్తూ సమాజ శ్రేయస్సుకు అంతా పాటుపడదామన్నారు. ఈ కార్యక్రమంలో చోడపల్లి సత్యం, చెల్లుబోయిన దేవుడు, ఉమ్మిడి గంగమ్మ, చోడపల్లి ధనలక్ష్మి, లోకనాథ్ అప్పా రావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని భార్య ఉమాకు నగదు చెక్కును అందిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 14: మునగపాక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన రామశేషు కుటుంబానికి శుక్రవారం తోటి హోంగార్డులు ఆర్థిక సహాయం అందజేశారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు ఒక రోజు వేతనానికి సంబంధించిన రూ.3,84,820ల చెక్కును జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ చేతుల మీదుగా మృతుని భార్య గేదెల ఉమాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఏవో శారదా తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన


ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తూరు, జూన్ 14: వెంకుపాలెంలో ఘనజీవామృతం తయారీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఘన జీమామృతం వల్ల భూమికి మంచి పోషకాలు అందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం, బెల్లం వంటి వాటికి ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మార్కెటింగ్ స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పండిన ఉత్పత్తులన్నీ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేస్తారన్నారు. మామూలు ఉత్పత్తుల కంటే పదిశాతం ఎక్కువ రేటుతో రైతులు అమ్ముకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ రకమైన వ్యవసాయం వల్ల రైతులతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతకుముందు సామూహికంగా వెయ్యి కేజీల ఘన జీవామృతం తయారు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మజ్జి సత్యారావు, మువ్వల అప్పారావు పాల్గొన్నారు.